
# ఊహకందని ఆనందాలు



అక్కడికి వెళ్లడానికి చాలా దారులున్నాయి!

అయితే ఆ దారుల్లో ఆ ఒక్క దారి అంటే నాకు మహా యిష్టం. అందుకే ప్రతిదినం సాయంకాలం ఆ దారి మీదనే నడుస్తాను.

అక్కడ మాట్లాడడానికి మనుషులుండరు. మత్తెక్కించడానికి మధువు దొరకదు. మనసైన మగువలుండరు. అయితే అక్కడ కూర్చుంటే మనసు వశం తప్పుతుంది. మత్తెక్కుతుంది. అక్కడ చెట్టూపుట్ట, రాయీరప్ప అన్నీ పలకరిస్తుంటే మనస్సుకు మాటలు వస్తాయి. అది ప్రకృతి మాత ఒడి! బ్రతుకు పాఠాలు నేర్చుకునే బడి ప్రశాంతత కోసం కోరి కోరి నేను వెతుక్కొన్న గుడి!!

ఆరాధనా పూర్వకమయింది కొందరి అందం. కవ్వించేది మరికొందరి అందం. స్వరాజ్యం అందం మాత్రం మునిపుంగవుల్ని కూడా కవ్వించేది!

స్వరాజ్యాన్ని సాధించడానికి ఎందరో ప్రాణాలు త్యాగం చేశారు. ఆస్తి పాస్తుల్ని తగలబెట్టుకొన్నారు. జైళ్ళల్లో మగ్గారు. స్వాతంత్ర్య సమరయోధులనిపించుకొన్నారు. ఇది మన జాతిచరిత్ర!

అయితే అందమైన స్వరాజ్యం కోసం ఎందరో కళాశాల విద్యార్థులు జుట్లు పెంచుకొన్నారు. గడ్డాలు పోటీపడ్డాయి. జుట్లు బాగా పెరిగిన దశలో ఒకరి జుట్లు ఒకరు పెరుక్కొన్నారు. రోడ్డు రోమియోలయ్యారు. స్వరాజ్యం విరహ పీడితుల జాబితాకు ఎక్కారు. మానసిక ప్రశాంతతసాకుతో మధుపాత్రలందుకొన్నాడు.. ఇది మా ఊరి చరిత్ర!

అలాంటి అందమైన స్వరాజ్యం ఒకనాడు, మా ఊళ్ళో ఒకానొక దేవాలయానికి వచ్చింది. ఉత్సవాలలో మునిగి తేలుతున్న దేవుణ్ణి చూడడానికని ఆమె వస్తే- ఆమెను చూడడానికని చాలామందివచ్చారు. చూడడానికని వచ్చినవాళ్ళు చూస్తే సరిపోయేది. చూస్తూ ఉండలేక పోయారు. ఊరికే ఉంటే ఊరాపేరా? ఉంటే వాళ్ల విద్యార్థులు ఎలా అవుతారు? ఒకడు సమయంచూచి పైట లాగాడు. మరొకడు సందుచూచి జడను లాగాడు. ఒకడు యికిలించాడు. ఇంకొకడు సకిలించాడు. అటు తర్వాత అందరు చేరి ఆమెను చుట్టుముట్టి అటూయిటూ కదలనివ్వకుండా నిలబెట్టారు!

ఆమె మాత్రం భయపడిందా! పేరే స్వరాజ్యం. లాగి ఒక్క చెంపదెబ్బ కొట్టింది ఒకణ్ణి. ఆ దెబ్బతో కుర్రకారు రెచ్చిపోయారు. అందరు కలిసి ఆమె మీద పడ్డారు నేటి రాజకీయ నాయకులు దేశం మీదపడ్డట్టు! ఎవరి చేతికి ఏమి దొరికితే దానితో ఏమి చేయాలో అది చేసుకొంటున్నారు.

స్వరాజ్యం స్పృహ తప్పి పడిపోయింది.

దేవుడు దీనిని గమనించే స్థితిలో లేడు. వాహనంమీద వయ్యారాలు పోతూ ముందుకు సాగిపోతున్నాడు.

ఆ దృశ్యంచూసి నా కడుపు తరక్కపోయింది. ఒక్క ఊపులో ఆ గుంపులో జొరబడ్డాను. "అలా చూస్తూ చూస్తూ నిలబడ్డారే! మీ కెవరికీ అక్క చెల్లెళ్ళు లేరా?" అని అరుస్తూ వాళ్ళమీద విరచక పడ్డాను. నా అరుపులతో మేలుకొనింది అక్కడ చేరిన గుంపు.

విద్యార్థులు దిక్కుకొకరుగా చెదిరిపోయారు.

ఆ తరువాత ఆ అమ్మాయిని రెండు చేతులతో జవురుకొన్నాను. ఓ మిత్రుని కారు అక్కడ ఉంటే అందులో పడుకోబెట్టాను. సురక్షితంగా ఇల్లు చేర్చాను. ఈ సంఘటన జరిగిన తరువాత నన్నొక 'హీరో'లా చూశారు ఆ వీధిలోని జనం. ఆ వీధిలోనే స్వరాజ్యలక్ష్మి ఉండేది. అందుకే ఆ వీధిలో నడవడమంటే నాకు మహా సరదా!

ఆ పక్క ఇంట్లోనే సువర్ణ ఉంది. నేను వెళ్ళే సమయానికి ఆమె వీధివాకిలి గుమ్మానికి ఆనుకొని నిలబడి ఉంటుంది. ఆమె రంగు సంధ్యారుణ కాంతిలో పోటీపడుతూ ఉంటుంది. ఆమె బుగ్గలతోనే నవ్వుతుంది. కండ్లతోనే పలకరిస్తుంది. ఆమెను ఊహిస్తే ఊర్వశి ఎదుట

నిలబడుతుంది. మేనక తిలోత్తమలు ముందు సాక్షాత్కరిస్తారు. ఆమెను చూస్తూ నడవడం కాదు విషాన్ని కూడా అమృతంలాగ తాగచ్చు. అందుకే ఆ వీధిలో నడవడం నాకు సరదా!

సువర్ణ ఇంటికి సరిగ్గా నాలుగో ఇంట్లో శాంత ఉంది. ఆ అమ్మాయి పేరుకు తగ్గ మనిషి. మనసిచ్చిన వాడిని మెచ్చింది. మెచ్చినవాడినే కట్టుకొనింది. కట్టుకొన్నవాడితో కాపురం చేస్తూ పిల్లల కోడిలా కనబడుతుంది. ఆ అమ్మాయిని చూస్తే నాకు చాలా గౌరవం. ఆ వీధిలో నడుస్తూ ఆమెను గురించి ఆలోచిస్తుంటాను.

శాంత ఇల్లు దాటగానే రోడ్డు మలుపు తిరుగుతుంది. ఆ మలుపులో ఓ కిళ్ళీకొట్టు!

చాలా కొద్దిపాటి స్థలంలో ఆలోచించి అమర్చిన కిళ్ళీకొట్టు అది. దోరగా మాగిన అరటిగెలలు ముందు వేలాడుతుంటాయి. పిప్పరమెంట్లు బిస్కత్తులతో నిండిన సీసాలు.. అర్థవృత్తాకృతిలో అవి అమరిన తీరు...చూడ ముచ్చటగా ఉంటుంది. అందమైన అద్దాల బీరువాల్లో రకరకాల సామగ్రులు పొందికగా పేర్చబడి ఉంటాయి. ఓ పళ్ళెం తళతళ మెరుస్తూ వేలాడుతూ ఉంటుంది. ఆ పళ్ళెంలో బొమ్మలకు పెట్టిన పచ్చని టోపీల్లా 'బీడా' లుంటాయి. పక్కనే ఓ కిరసనాయిలు దీపం వెలుగుతూ ఉంటుంది– దిష్టిచుక్క లాగా!

సాధారణంగా ఏ కిళ్ళీకొట్టును చూసినా ఇలాగే ఉంటుంది. అయితే ఏ కిళ్ళీకొట్టుముందు లేనంతటి సందడి ఈ కిళ్ళీకొట్టు ముందుండడానికి కారణం ఆ కిళ్ళీకొట్టులో సరుకు అందం గాదు. ఆ కిళ్ళీకొట్టులో కూర్చున్న ఆమె సౌందర్యం.

ఆ సౌందర్యరాశి ఓ ఎన్జీవోగారి సతీమణి!

చిరిగిన చెప్పులు....నలిగిన పంట్లాం..... అంతకంటే నలిగిన చొక్కా... పెరిగిన గడ్డం... గంపెడు పిల్లలు.... ఓ గుంపు సంసారం... ఆదిగా గల ఎన్జీవో లక్షణాలలో దేనికీ తీసిపోడు ఈ పుణ్యాత్ముడు కూడా! అయితే ఈ ఎన్జీవోగారికి కాస్త తెలివితేటలు ఎక్కువగా ఉన్నట్లు తోస్తుంది– మిగతా వాళ్ళతో పోల్చిచూస్తే!–

అతడు పనిచేసే ఆఫీసు ఎదుట ఓ చిన్న పూరిగుడిసె ఉంది. ఆ గుడిసెలో ఇద్దరు ఆలుమగలు. వాళ్ళకు ముగ్గురు పిల్లలు. ఆ ఇంటి యజమానికి తెలిసిన విషయాలు రెండే! ఒకటి: తాగడం. రెండు : ఆ కైపులో పెళ్ళాన్ని చావదన్నడం. అయినా నోరు కదిపేది కాదు ఆ మహా సాధ్వి. అతగాడు పైసాపని చేయలేకపోయినా పైసలిచ్చేది తాగడానికి. ఇరుగు పొరుగు ఆమెను పతివ్రత అంటారు. ఆ మాట నిలబెట్టుకోవడానికి ఆమె చాలా కష్టపడుతుంది పాపం! కాపురముంటున్నది గుడిసె అయినా చాలా శుభ్రంగా ఉంచుతుంది. పిల్లలమీద ఈగ వాలనీయదు. ఇంతటికీ ఆమె సంసారాన్ని ఎలా నెట్టుకొస్తూంది అంటే ఆ గుడిసెముందు ఓ అరుగు కట్టుకొనింది. ఆ అరుగుమీద నాలుగురకాల పిప్పరమెట్లు నాల్గు సీసాల్లో ఉంచుతుంది. ఓ డబ్బా నిండుగా వేరుశెనగ ఉండలుంచుతుంది. ఓ చిన్న బుట్టలో నాలుగు కట్టల బీడీలు. అయిదారు రకాల సిగరెట్టు పెట్టెలు ఓ డజను అగ్గిపెట్టెలు ఉంచుతుంది. ఆ అరుగు మీద కొట్టు! ఆమె మనుగడకే ఆటపట్టు!!

ఆ గుడిసెకు ఎదురుగా ఓ పాఠశాల. పక్కన ఓ ఆఫీసు. ఆఫీసులో ఎన్జీవోలు వేసారిన జీవితాలకు రక్తి చేకూర్చటానికి బీడీ, సిగరెట్టు కొంటారు. చవీసారంలేని చదువులతో నోరు చప్పబడిన బడి పిల్లలు పిప్పరమెంట్లు కొంటారు. దీనితోనే గుట్టుగా సంసారం నెట్టుకొస్తూ ఉంది ఆ గృహలక్ష్మి!

ఇదంతా గమనించాడు ఎన్జీవో! పొద్దస్తమానం గాడిద చాకిరి చేసినా అందరికి కడుపునిండా కూడుబెట్టలేక సతమతమవుతున్నాడు తాను. తన బతుక్కంటే ఈ గుడిసెబతుకే ఎన్నోరెట్లు నయం. ఆలోచించాడు ఎన్జీవో! తీవ్రంగా ఆలోచించాడు. ఎన్జీవో తెలివికి మించి ఆలోచించాడు. ఆ ఆలోచనాపర్యవసానమే మూడురోడ్లు కలిసేచోట ముచ్చటయిన కిళ్ళీకొట్టు!

అందమయిన తన అర్ధాంగిని అంగట్లో కూర్చోబెట్టడం అతని తెలివితేటలకు మరో నిదర్శనం!

నేను ఆ కిళ్ళీకొట్టు ముందు నడుస్తున్నప్పటికి సంజచీకటి ఆవరిస్తూ ఉంటుంది. కొట్టుముందు వెండివెలుగులు ప్రసరిస్తుంటాయి. ఆ వెలుగుల్ని ప్రసరిస్తున్నది ట్యూబ్‌లైటా? లేదు. ఆమె ధరించిన 'మూన్‌కట్' జాకెట్టా? నిదానించి చూడవలసివస్తుంది. అలా చూస్తుంటే ఆ వెలుగులకే వెలుగునిస్తూ ఉంటుంది కొట్టుమధ్యతో కూర్చున్న జవ్వని. ఆమె చిరునవ్వులు సిగపూలతో పోటీపడుతుంటాయి. గుమిగూడిన వాళ్ళ చేతులు జేబులతో పోటీపడుతుంటాయి. పుసుపు కుంకుమ అలంకారాలతో కళకళలాడుతున్న గల్లా పెట్టె గలగల నవ్వుతుంటుంది. ఆ సమీపంలోనే మరో కిళ్ళీకొట్టు ఉన్న వాడిముందు లేనివాడిలా... తింటున్నవాడి ముందు ఆకలి కొన్నవాడిలా... దీనంగా నిలబడింది. పాపం! చూస్తే జాలేస్తుంది.

సాయంకాలంపూట వాహ్యాళికి బయలుదేరితే స్వరాజ్యలక్ష్మి మనసులో మెదులుతుంది. సువర్ణకండ్లతో పలకరించి బుగ్గలతోనే నవ్వుతుంది. శాంతమీద గౌరవభావం ఇనుమడిస్తుంది. కిళ్ళీకొట్టు అందాన్ని కిళ్ళీలా నమలబుద్ధి అవుతుంది.

ఆ దారిమీద నడుస్తుంటే ఇన్ని అనుభవాలతో గుండె బరువెక్కుతుంది. నడక మందగిస్తుంది. ఊరుదాటి ఆరుబయట చేరేసరికి కారుచీకటి విచ్చుకత్తులు విసురుతూ ఉంటుంది. అక్కడొకటి అక్కడొకటిగా వెలుగుతున్న విద్యుద్దీపాలు చీకటిని ఛేదించడానికి వ్యర్థప్రయత్నాలు చేస్తుంటాయి.

అక్కడ పచ్చని పచ్చికమీద చతికిలబడడం ఎంతోహాయిగా ఉంటుంది. చుట్టూ రాళ్ళూ రప్పలు... పొదిచెట్లు... ఆ పొదిచెట్ల మీద నోరులేని గువ్వలు. ఒక చెట్టుమీద నుండి ఇంకొక చెట్టుమీద వాలుతుంటాయి. కొండంత చీకటికి గోరంత వెలుగు అన్నట్లుగా మిణుగురులు మినుక్కు మినుక్కుమంటుంటాయి. తిరుమల కొండనుండి దిగుతున్న బస్సులు ఒకదానితో ఒకటి పోటీపడుతుంటాయి. స్వార్థము... కుళ్ళు... కుత్సితము... అసూయా ద్వేషాలతో అలమటించిపోతున్న దేశ కాలగతులను దేవుడనే వాడికి నివేదించాలని కొన్ని పవిత్రాత్మలన్నీ పయనమై ఈ లోకంలో ప్రతి అవసరానికీ అలవాటయిన 'క్యూ' పద్ధతిని మరచిపోలేకుండా ఒకరి వెంబడి ఒకరుగా నిలబడి ఎక్కగలిగినంత మేర పైకెక్కి ఆపై దేవుడనేవాడు కనబడకపోతే

ఎటూ పోలేక నిలబడినట్లున్నాయి తిరుమల కొండపై కాలిబాటపై వెలుగుతున్న విద్యుద్దీపాలు. చూస్తున్నకొద్దీ ఏదో కొత్తదనం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అందుకే ప్రతిరోజు అక్కడ కనీసం ఓ గంటసేపయినా కూర్చోకపోతే ఏదో పోగొట్టుకొన్నట్లనిపిస్తుంది.

ఓ రోజు యథాప్రకారం నాదారిన నేను పడ్డాను. కిళ్ళీకొట్టు ముందు కాసేపు నిలబడ్డాను.

అదే వెన్నెల వెలుగులు... చిరునవ్వుల జిలుగులు... పైసల గల గలలు... పడుచుదనం పరిహాస విన్యాసాలు... బాగా సందడిగానే ఉంది.

హిప్పీలు సినిమా సంగీతానికి అనుగుణంగా చప్పట్లుకొడుతున్నారు. కొందరామెను కళ్ళతోనే తాగేస్తున్నారు. మరికొందరు చవకబారు జోకులు విసురుతున్నారు. ఆమె కనుసన్నల్లో మెదలుతూ ఆమెకు అండదండగా ఉన్నాడు ఎన్జీవో!

అంతలో ఓ కుర్రవాడు ఆమె వెనుక నిలబడ్డాడు. దాదాపు ఆమె వీపును అనుకున్నంత దగ్గరగా నిలబడ్డాడు. ఆమె తలలోని పువ్వుల వైపు తదేకదృష్టిని నిలిపాడు. నిమీలిత నేత్రుడై బాగా ఊపిరి ఎగపీలుస్తూ 'అల్లరి ఊహల్ని గిల్లిపెడుతున్నాయండీ మీ సిగలో మల్లెలు!' అన్నాడు.

చిలిపిగా అతనివైపు చూసిందామె. సిగలో పూవులు చేతికి వచ్చాయి. దోసెడు మల్లెపూల చెండు రెండయింది. ఒకటి ఆ కుర్రవాని చేతికందిస్తూ మరొకటి తలలో తురుముకొనింది. ఆ కుర్రవాడు దేవుని ముందు భక్తుడయ్యాడు. మహాప్రసాదంలా స్వీకరించాడు. ఆనంద పారవశ్యంతో కళ్ళకద్దుకొంటున్నాడు.

కొట్టుముందు వెండి వెలుగులు వగలుపడ్డాయి. అందరి కళ్ళల్లో ఆనందం తొణికిసలాడింది. ఎన్జీవో కన్నుల్లో మాత్రం ఎర్రజీర ఎగ్గొట్టుకొస్తున్నట్టు తోచింది.

అక్కడ నిలబడలేకపోయాను!

ఆరుబయట కూర్చున్నాను!!

"ఎందుకలా కుంచించుకుపోతారు. ఎందుకలా అట్టడుగున పడిపోతారు. ఎదగండి. మాలాగా పైకెదగండి. ఈ మోసాలకు వ్యసనాలకు అతీతులుగా పైకెదగండి" అన్న ఓ అమూల్యమైన సందేశాన్ని అందజేస్తున్నట్లున్న తిరుమల కొండలు ఆకాశంలో కలిసిపోతున్నట్లున్నాయి. పక్కనే ఓ ఆసుపత్రి. ఆ ఆసుపత్రిలో ఎన్నో బాధలు. వ్యధలు! వాటికి మించినన్ని కుళ్ళు కుత్సితాల గాథలు. వీటన్నిటినీ దేశానికి పంచడం ఇష్టంలేక మూతి ముడుచుక కూర్చున్నాడు వాయుదేవుడు. ఆలోచనలు మాత్రం గుడ్డెద్దు చేనులో పడ్డట్టు సాగిపోతున్నాయి!...

ఈ పాటికి ఈర్ష్యాగ్నిలో పడి ఈదులాడుతుంటాడు ఎన్జీవో!

ఎవరో కాలేజీ కుర్రకుంక.... సిగలో మల్లెపూలు..... తీసుకొంటూ వాడు ప్రకటించిన తీరుతెన్నులు .... ఆమె చిరునవ్వులు .... ఇంకా కండ్లముందు మెదలుతూనే ఉంటాయి. ఒళ్ళు కుతకుత ఉడికిపోతూ ఉంటుంది. రోజూ కొట్టు కట్టేసేవరకు అక్కడ ఉండి ఆమెకు అంతో

ఇంతో సాయపడేవాడు. కానీ ఈ రోజు అక్కడ నిలబడలేక పోతాడు. వెళ్ళి కూర్చుంటాడు ఇంట్లో అగ్గిమీద.

ఆమె కిళ్ళీకొట్టులోని సామానంతా సర్ది పెడుతుంది. కొట్టు మూసి తాళం వేస్తుంది. ఇంట్లో అడుగుపెడుతుంది. అడుగు పెట్టడమే తరువాయి. అతడామెమీద విరుచుక పడతాడు. చావగొడతాడు. ఎదురుచూడని ఈ సత్కారంతో ఆమె దిగ్భ్రాంతి చెందుతుంది. నోట మాటరాదు. కళ్ళల్లో నీళ్ళు ఆగవు. "ఏంవిటిదంతా? నీకేంవయినా పిచ్చి పట్టిందా?" అన్నట్లు ఆశ్చర్యంగా చూస్తుందతనివైపు. అతడు ఆవేశంతో ఊగిపోతూ!

"ఛీ! సిగ్గుండక్కర్లే? నా ఖర్మ గాలి బజారు కెక్కిస్తే మాత్రం ఇంత బరితెగిస్తావా? వాడెవడో కుర్ర ముండాకొడుకు. తల్లో పువ్వులు కావాలంటే తన్ని తగలెయ్యకుండా సగం పూలు వాడికిస్తావా? పదిమంది చూస్తున్నారని కూడా లేదు. జంకు కొంకూ లేదు. ఇంతకూ నేను బతికినట్లా? చచ్చినట్లా?" చిందులు తొక్కుతాడు ఎన్జీవో.

అప్పటికి తెలిసివస్తుందామెకు అసలు సంగతి. రోషం ముంచుకొస్తుంది.

"చేస్తున్నది వ్యాపారం!"

"నే కాదన్నానా"

"అందుకే ఇలాంటి వన్నీ అవసరం!"

"ఎవరు చెప్పారు"

"ఈ ఏడాది అనుభవం!"

"ఏమని చెప్పింది?... ఈలాంటి పాడు పనులు చేయమనిగదూ!"

"ఆ మాట కొస్తే ఆడది అంగట్లో కూర్చోవడమే పాడుపని?"

"కూర్చుంటే కులకమన్నానా?"

"మీరు కులకమనరు. పరిస్థితులు కులికిస్తాయి."

"ఏంవిటీ వాగుడు?"

"లేకపోతే ఏంవిటండీ? ఏడాది కిందట వేసుకున్న చొక్కా మార్చుకోవడానికి యోగ్యతలేదు మీకు. కడుపునిండా అంత తిని బిడ్డలకు పెట్టే శక్తి లేదు నాకు. ఈ రోజు మీ వేషమే మారింది. నా బిడ్డలు నాలుగు కూరలతో మూడుపూటలు అంత తింటున్నారు. ఎలా వచ్చాయో? ఆలోచించారా!– పోనీ! ఇలాంటి కిళ్ళీ కొట్లెన్ని ఉన్నాయి ఈ వీధిలోనే! వాటివైపు చూస్తే తెలిసిపోతుంది అసలు రహస్యం. ఇప్పుడు లోకానికి కావలసింది సరకు నాణ్యం కాదు. నా చూపుల్లో తళుకు. నా మాటల్లో వగలు. అవే చేస్తున్నాను. సంపాదిస్తున్నాను. అయినా నాఖర్మ కాకపోతే ఈ గొడవంతా ఎందుకు? కట్టుకున్న వాడివి. కట్టుకోవడానికంత బట్ట. కడుపుకింత తిండి పడేసి నాలుగు గోడలమధ్య తొక్కి పెట్టరాదూ? నేనేంవయినా కిళ్ళీకొట్టు పెట్టండి. నన్నందులో కూర్చోబెట్టండి. కులకతానని మొత్తుకొన్నానా? ఆడదాని శీలం కేవలం దేహానికి మాత్రమే పరిమితం కాదు– అది మనస్సుతోకూడా ముడిపడింది. అంగడిలో కూర్చోవడమంటే–

మానసిక పతనమే. నావల్ల కాదంటే అవునంటిరి. ఈనాడేవో లేనిపోని సందేహాలతో నన్ను వేపుకు తింటున్నారు. ఎందుకొచ్చిన గొడవ? ఏ నుయ్యో గొయ్యో చూసుకొంటే సరిపోతుంది!"

అభిమానము, ఆవేశము ఒకదానితో ఒకటి పోటీపడి ఆమెను కన్నీళ్ళ పర్యంతం చేస్తే మాట్లాడలేకుండా వెళ్ళిపోతుంది.

ఎన్జీవో నోరుపడిపోతుంది.

ఈ అవమానాన్ని భరించలేక కిళ్ళీకొట్టు సుందరి బావిలో పడిచస్తుంది.

నా ఊహలతో ఒళ్ళు జలదరించింది!

ప్రశాంతమైన వాతావరణంలో కూర్చున్నా నా ఆలోచనలు నన్ను ముళ్ళమీద కూర్చోబెట్టాయి. కూర్చోలేక లేచి నిలబడ్డాను. చెమటలు పోస్తున్నాయి. రాత్రి పదిగంటలు దాటింది. చుట్టూ కలయచూశాను. వాతావరణం ఆహ్లాదకరంగా మారుతూ ఉంది.

అయినా కూర్చోవడానికి బుద్ధిపుట్టలేదు.

ఇంటిముఖం పట్టాను.

కిళ్ళీకొట్టుముందు ఇంకా సందడిగానే వుంది.

అనుకోకుండానే కాలు నిలిచిందక్కడ!

"ఏంవండీ! సోడా అడుగుతూంటే అలా నిలబడ్డారేం? పాపం! ఎంతసేపని నిలబడతారు!" మాటను సాగదీస్తూ ఉంది కిళ్ళీకొట్టులో సుందరి.

బుద్ధిమంతుడైన కుర్రవాడివలె సోడా అందుకున్నాడు ఎన్జీవో!

అంతలో మరో 'సూట్‌వాలా' ప్రత్యక్షమయ్యాడు.

"ఇదో మిమ్మల్నే! ఆ కుర్చీతీసి అలా వెయ్యండి. వారు కూర్చుంటారు!" ఆజ్ఞలాగా వినిపించింది మాట.

మాట మన్నించాడు ఎన్జీవో!

నాతల తిరుగుతూంది. తిరుగుతున్న తలలో సిగలో మల్లెలు.... కుర్రవాడి దోసిట్లో అవి పడిన వగలు... ఎన్జీవో గుండెల్లో లేచిన పొగలు... ఆరుబయట కూర్చుంటే నాలో చెలరేగిన ఊహలు!.....

ఏన్జీవో మగవాడే! నేనూ మగవాణ్ణే!.... ఇద్దరి మధ్య అంతరం? ఓ అగాధం!

నా ఊహలే నన్ను వెక్కిరించాయి!

* * * * *

నెలరోజుల తర్వాత ఆ దారి పట్టి నడుస్తున్నాను. ఏవో కొన్ని అత్యవసర పరిస్థితుల్లో నేను ఊరు విడిచి వెళ్ళవలసి వచ్చింది. ఊళ్ళో లేకపోయినప్పటికీ నా మనసు మాత్రం ఆ దారిమీద తిరుగుతూనే ఉంటుంది. స్వరాజ్యలక్ష్మి, సువర్ణ, శాంత నా ఆలోచనల అదుపులోనే ఉంటారు.

ఆరోజు ఆదారిమీద ఎంతో ఉత్సాహంగా నడుస్తున్నాను. అనుకోని విధంగా స్వరాజ్యలక్ష్మి కనిపించింది. చూచీ చూడనట్లు నన్ను చూసింది. చూస్తూ నవ్వింది. ఆమె నవ్వుతుంటే పువ్వులు

రాలాయి. గుండె చేతులైజవురుకొనింది. సువర్ణ ఇంతకు మునుపు ఎప్పుడూ లేని విధంగా సింగారించుకొని బుగ్గలతోనే పలకరించింది. పరవశించిపోయాను. పిల్లలకోడి శాంత ఓ పిల్లవాడితో నమస్కారం పెట్టించింది.

అనుభూతిని ఇముడ్చుకోలేని గుండె కండ్లల్లో కరుగుతూ ఉంది. నడక ఊపందు కొనింది. తటాలున ఆగి కిళ్ళీకొట్టువైపు చూశాను.

మూసిన తలుపులు నన్ను చూసి వెక్కిరిస్తున్నాయి!

ఆ సమయానికి ఎంతో సందడిగా కళకళలాడుతూ ఉండవలసిన ఆ చోటు పాడుగొట్టు కొంటూ ఉంది. కారణాన్ని ఊహించలేక ఆ కిళ్ళీకొట్టునే చూస్తున్నాను. అంతలో ఎవరో కాలిమీద గీరుతున్నట్లనిపించింది. ఎవరా? అని చూశాను. ఎవరో ఓ కుర్రవాడు. ఈడ్చికొలిస్తే నా నడుం ఎత్తుకు మించడు. ఏమి చెబుతాడా? అని పిల్లవాణ్ణే చూస్తున్నాను. వాడు అదోరకంగా నా మొహంలోకి చూశాడు. ఆ తరువాత అమాయకంగా ఆకిళ్ళీకొట్టు వైపు చూశాడు. మళ్ళీ నన్ను చూస్తూ "ఆమె చచ్చిపొయ్యింది!" అన్నాడు.

నా చెవుల్ని నేనే నమ్మలేనిస్థితి. ఆ స్థితినుండి కోలుకొని 'నిజమా!' అన్నట్లుగా ఆ పిల్లవాణ్ణి చూశాను."అంతే!" తన పని అన్నట్లుగా ఆ పిల్లవాడు ఏమయ్యాడో కనిపించలేదు.

ఆమె ఎందుకు చనిపోయింది? ఎలా చనిపోయింది? అని నా మనస్సు పీకుతూనే ఉంది. ఆదారిమీద– నాకు ఎంతో ఇష్టమైన ఆదారిమీద నడుస్తుంటే ఏదో వెలితి. అర్థంకాని వెలితి. నాతో ప్రమేయంలేకనే ఆమె నా మనస్సును ఆక్రమించిన చిత్రం. ఒక ఆత్మీయురాల్ని పోగొట్టుకొన్న తపన. రెండు మూడురోజులు గడిచినా ఆ స్థితిలో నుండి నేను తేరుకోలేకపోయాను!

ఆ స్థితిలోనే రెండుమూడురోజులు గడిచిపోయాయి!

ఆమె చనిపోయింది కిళ్ళీకొట్టులో కూర్చోలేక కాదు. కిళ్ళీకొట్టులో వయ్యారాలు పడుతూ మగనిపోరు పడలేకకాదు. మగని డబ్బు దాహానికి కిళ్ళీ కొట్టులోని సరుకులతో పాటు తన శీలాన్ని కూడా అమ్ముకోడానికి ఇష్టపడక! అని విన్నప్పుడు నా గుండె బాధగా మూలిగింది– మనిషి స్వార్థానికి సరిహద్దులు ఊహించలేక!

ఇది నేను ఊహించని లోతు! ●

ఆంధ్రభూమి
(22, నవంబర్ 1979)